జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు పురస్కార ప్రధానోత్సవం

విశాలాంధ్ర-పాతపట్నం : శ్రీకాకుళం మండలం కేంద్రంలోని డా.బి.ఆర్ అంబేద్కర్ కళా ప్రాంగణం నందు, కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్ సారథ్యంలో పాఠశాల విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పురస్కార ప్రదానోత్సవం-2023 కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి, ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం మరియు రాష్ట్ర పాడి,పశు సంవర్ధక అండ్ మత్స్య శాఖా మంత్రి సీదిరి అప్పలరాజు వారితో కలసి పాల్గొన్నారు. పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యురాలు రెడ్డి శాంతి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2023 పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు మరియు 2023 ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రతీ గ్రూపులో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ ఎక్సలెన్స్ అవార్డ్స్) పురస్కారాలను ప్రదానం చేశారు.

ఝాన్సీ లక్ష్మీబాయి 165వ వర్ధంతి

విశాలాంధ్ర-పాతపట్నం : మండలం కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధురాలు, మహారాణి ఝాన్సీ లక్ష్మీబాయి 165వ వర్ధంతి కార్యక్రమం,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాతపట్నం, వైస్ ప్రిన్సిపాల్ వట్టి అర్చన అధ్యక్షతన, పాతపట్నంకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అర్చన గారు, రామరాజు మాట్లాడుతూ 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర మహారాణి ఝాన్సీ లక్ష్మీబాయి పోషించారని, పరిపాలనలో ఝాన్సీకి రాణిగా ప్రసిద్ధికెక్కిందని, భారతదేశం జోన ఆఫ్ ఆర్కుగా ప్రసిద్ధి చెందని, విద్యార్థులు ఝాన్సీ లక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, నిత్య స్మరణయురాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిణీలు,విద్యార్థులు పాల్గొన్నారు.

వికసించిన విద్యా కుసుమం యశశ్రీ

ఆలిండియా నీట్‌లో 40వ ర్యాంక్.... ఇంటికెళ్లి అభినందించిన సిరిపురం తేజేశ్వరరావు

విశాలాంధ్ర -పాతపట్నం: మండలం కేంద్రం యశోద నగర్ వీధికి చెందిన కానీ యశశ్రీ ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 40వ ర్యాంకు సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన యశశ్రీని విద్యావేత్త పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు వారి నివాసానికి వెళ్లి ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుక బడిన జిల్లా అయినా మన శ్రీకాకుళం జిల్లా నుంచి ముఖ్యంగా మన పాతపట్నం నియోజకవర్గ నుంచి ఈ స్థాయిలో రాంక్యు సాధించడం వలన మన ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకువచ్చారని ఆమెను కొనియాడారు. అనంతరం ఆమె తల్లదండ్రులు అయినా కానీ గురువులు కుసుమ కుమారిలకు అభినందనలు తెలిపారు. యశశ్రీ ఇంకా ఎన్నో ర్యాంకులు సాధించుకొని ఉన్నత స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని కోరుకుంటున్నానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రిటైర్డ్ టీచర్ యజ్జల భాస్కర రావు, వివిధ పాఠశాల్లో కాలేజీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కొండాల ఛత్రపతి,దార గరికయ్య, ఎస్. భాస్కర రావు, దార అనురాధ, కరజాడ గోవింద రావు, కరజాడ సుశీల, కొల్లి ధనంజయ, టి ధనుంజయ, పీఈటీ సుజాత,సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, పడాల తిరుపతిరావు, ఎల్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోరు మరమ్మతులు చేపట్టాలి : జనసేన నాయకుడు తోట ప్రశాంత్

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం 31వ వార్డు సీతారామనగర్ వీధిలో గత నెల రోజులుగా చేతి పంపు పక్కనే ఉన్న మురికి కాలువ నీరు బోరులో దిగిపోవడంతో నీరు దుర్వాసన వస్తుందని జనసేన నాయకులు తోట ప్రశాంత్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోరు మరమ్మతులు చేసి మంచినీరందించే విధంగా చర్యలు తీసుకోవా లని మున్సిపల్ సిబ్బందిని కోరినా ఆదిశగా చర్యలు లేకపోవడంతో ఈనెల 13వ తేదీన 1902కు గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. దీంతో సచివాలయం ఇమ్యూనిటీస్ అధికారిని చందన, ఎ.ఇలు, మున్సిపల్ సిబ్బందితో కలిసి బోరు వద్దకు వచ్చి మరమ్మతుల కోసం కాలువ స్లేట్లు తొలగించి 4 రోజులైనా అలాగే వదిలేశారని, దీని వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతుల విషయమై ఇమ్యూనిటీస్ అధికారిని చందన దృష్టికి తీసుకువెళ్లిన అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా మరమ్మతులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు.

ఆదర్శ గ్రామప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

సంయుక్త కలెక్టర్ యం.నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన (ఎస్ఏజీవై) పథకం ద్వారా ఆదర్శ గ్రామాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని, ఆ దిశగా అధికారులు కృషిచేయాలని సంయుక్త కలెక్టర్ యం.నవీన్ జిల్లా అధికారులకు పిలుపునిచ్చారు. సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన పథకం ద్వారా జిల్లాలో ఎంపికకాబడిన ఆదర్శ గ్రామాలలో నిర్దిష్ట ప్రణాళికపై కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా స్థాయి సమావేశం సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎస్ఏజీవై ముఖ్య లక్ష్యమైన ప్రజల జీవనప్రమాణాలను మరింత మెరుగుపరచి, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దెందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రజల ఆర్థిక, సామాజికాభివృద్ధి, సుపరిపాలన దిశగా ప్రణాళికలను తీర్చిదిద్ది, ఎంపిక చేసిన గ్రామాలను, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ముఖ్యంగా ఎం.పి.డి.ఓలు, ఇ.ఓ.పి.ఆర్.డిలు, పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, పార్లమెంటు సభ్యులచే ఎంపికచేయబడిన నాలుగు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్ది అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఆదర్శ గ్రామాలుగా ఎంపికైన సోంపేట మండలం ఇసుకలపాలెం, పలాస మండలం గురుదాసుపురం, కొత్తూరు మండలం కుద్దిగాం, శ్రీకాకుళం మండలం నైరా, పొందూరు మండలం తండ్యాం ప్రాంతాల్లో ఇప్పటికే తయారుకాబడిన గ్రామ అభివృద్ధి ప్రణాళికను సకాలంలో అమలుచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్, ముఖ్య ప్రణాళికాధికారి వి.యస్.యస్.లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బి.మీనాక్షి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీతాల పెంపు కోసం పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మేజర్‌పంచాయతీలో జీతాలు పెంచాలనే డిమాండ్‌తో పారిశుద్ధ్య కార్మికులు మెరుపు సమ్మెను ప్రారంభించారు. గత నాలుగురోజులుగా సమ్మెను కొనసాగిస్తూ పారిశుద్ధ్యపనులకు దూరంగా ఉన్నారు. స్థానికసర్పంచ్ నగిరి ప్రభావతమ్మ, ఈఓ వరప్రసాదరావు సమ్మె విరమించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలంటూ కోరినప్పటికి కార్మికులు ససేమిరా అంటున్నారు. జీతాలు పెంచడం తమ ఒక్కరి చేతిలో లేదనిపాలక వర్గం సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని అంత వరకు విధులు కొనసాగించాలని కోరినప్పటికి కార్మికులు జీతాలు పెంచనిదే విధులు చేపట్టబోమని తెగవేసి చెప్పడం గమనార్హం. దీంతో ఈ విషయాన్ని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన శనివారం సోంపేట పంచాయతీ కార్యాలయానికి హాజరై కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా కార్మికులు మాత్రం అంగీకరించకపోవడం గమనార్హం. జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేసి ఈ సమస్యపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని డివిజనల్ పంచాయతీ అధికారి కార్మికులకు నచ్చజెప్పారు. ఇదిలా ఉండగా ఎన్నడూ లేని విధంగా కనీసం ముందస్తు నోటీసు లేకుండా సమ్మె చేయడం వెనుక అధికార పార్టీకి చెందిన కొంత మంది హస్తం ఉందని పట్టణంలో పలువురు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌సర్పంచ్ మల్లా వెంకటరమణ,వార్డు సభ్యులు తోట ఢిల్లీరావు, చింతల భీమారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలి



విశాలాంధ్ర -జలుమూరు : విపరీతంగా పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలని వెంకటాపురం సచివాలయ ఏఎన్ఎం నాగమణి పేర్కొన్నారు. శనివారం జలుమూరు మండలం వెంకటాపురం సచివాలయం పరిధిలోని పలు గ్రామాల్లో వడ దెబ్బ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నీరు, మజ్జిగ, బార్లీ వంటి ద్రావణాలను అధికంగా వినియోగించాలని సూచించారు. ఉపాధి హామీ వేతనదారులు జాగ్రత్తగా ఉండాలని ఉద్బోధించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

నేడు విజయవాడలో రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ జూన్ 18న ఆదివారం విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ వర్కర్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ బి.మురళి, సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. జూన్ 18 సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ శనివారం శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌వద్ద యూనియన్ నాయకులు కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సమాన పనికి సమాన వేతనం అమలుచేస్తామని వైసిపి ప్రభుత్వం హామీలు ఇచ్చిందన్నారు. ఈ హామీలకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం 6,667మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని ప్రకటించింది ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో ఎంతమందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని చెప్ప లేదు అందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పిందని అన్నారు. దీనికి భిన్నంగా ప్రకటన చేయడం మూడు లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను మోసగించడ మేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాటం కొనసాగించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులను ఆందోళనకు సన్నద్ధం చేయడానికి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకోవడానికి జూన్ 18న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు అన్ని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు హాజరు కావాలన్నారు. గత పిఆర్సీలోని కనీస వేతనం రూ.20వేలు కాగా కేవలం రూ.15 వేలతో జీవో విడుదల చేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను దగా చేసిందన్నారు. ఈకార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.సోమేశ్వరరావు, రిమ్స్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం సూర్యనారాయణ, జి.లక్ష్మణ, నర్సింగరావు, టి.భాస్కరరావు, డివి.రమణ నూకరాజు, చంద్రశేఖరు, ప్రసాదు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలి

విశాలాంధ్ర-రణస్థలం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ రజకులకు పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేయటానికి టిక్కెట్లు కేటాయించాలని రజక సంఘాల నాయకులు, రజక సాధికారిక కమిటి,కన్వీనర్లు, సభ్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు,జాతీయ ప్రాదాన కార్యదర్శి, మాజీ మంత్రివర్యులు నారా లోకేష్, ఎపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడులను రజక సంఘాల నాయులు విజ్ఞప్తిచేసున్నారు. రాష్ట్రంలో రజకలు సుమారుగా 90 శాతం వరకు తెలుగుదేశం పార్టీలోనే ఉన్నామని వారు వివరించారు. ఉమ్మడి ఉత్తరాంధ్రా జిల్లాల్లో విశాఖపట్నం విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి రాష్ట్ర రజక కార్పోరేషన్ మాజీ చైర్మెన్ రాజమండ్రి నారాయణకు, ఇతర ప్రాంతంల్లో మరికొంతమందికి ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించాలని రజక సంఘాల నాయకులు కోరారు. రానున్నది తులుగుదేశం పార్టీయేనని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కులాల దా.మా.సా ప్రకారం 5 స్థానంలో రజకులు ఉన్నారని గుర్తు చేశారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని విదాలుగా రజకులు వెనకబడి ఉన్నమన్నారు. దా.మా.సా ప్రకారం రజకులకు రాజకీయ ప్రాదాన్యత కల్పించాలని కోరారు. రాష్ట్రం వైసీపీ పాలనలో రజకులుపై దాడులు, దౌర్జాన్యాలు, హత్యలు పెరుగాయని వారు మండిపడ్డారు. వైసీపీ అధికారం వచ్చి నాలుగేళు పూర్తయిన రజకులకు ఒక్క ఎమ్మెల్సీగాని మంచి నామినేడేట్ పదవులుగాని ఇవ్వకుండా చిన్న చూపుచూస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర నాయకులు అడ్డూరి శంకర్, నౌపడ రామారావు మాట్లాడుతూ వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నపడు రజకులు అన్నివిదాలుగా ఆదుకొని రాజకీయ ప్రాదాన్యత ఇస్తామన్న జగన్ అధికారం వచ్చిన తరువాత రజకులను పట్టించుకోపోవడం బాదాకరమని ఆయన వైసీపీ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో రజకులంతా వైసీపీ ప్రభుత్వానికి ఓటు ద్వారా తగిన బుద్ది చెబుతారని హెచ్చరించారు. తొలిత టిడిడి విడుదల చేసిన "భవిష్యత్ గ్యారెంటీ" మేన్‌పేస్టోపై పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రజక కార్పోరేషన్ మాజీ చైర్మెన్ రాజమండ్రి నారాయణ, రజక సంఘం నాయుకులు కోవూరు సురేష్‌కుమార్, సోపేటి రామారావు, ధర్మవరపు శంకరరావు, జొన్నాడ భాస్కరరావు, నారు ఎల్లాజీ, రుంకాన నూకరాజు, పసుపులేటి గోవింద్, నెపర్తి కొండబాబు, గురజాపు రాము, సత్యం, అప్పలస్వామి, చీపురుపల్లి స్వరూప్, సాగర్, అచ్చెన్న, లక్ష్మణరావు, శ్రీనివాస్,టి బి రమణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడే... కబ్జాదారుడు..?

విశాలాంధ్ర-పలాస : దీపం ఉండగానే ఇలు చక్కబెట్టుకోవాలనే చందంగా పలాస నియోజకవర్గంలో కొంత మంది భూ కబ్జాదారులు తమ కార్యకలాపాలను జోరుగా కొనసాగిస్తున్నారు. ఎన్నికలు మరో 8నెలలు ఉండగా ఈలోగా ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వ భూములను, కాలువలను, చెరువులను వదలా బొమ్మాళి.. వదలా... అంటూ కబ్జాలకు పాల్పడుతున్నారు. విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజకీయ అండతో కబ్జా అవతారమెత్తి అనేక భూకబ్జాలకు పాల్పడుతున్నారనే ప్రచారం జోరుగా వినిపిస్తుంది. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ ప్రాంతంలో ఈ ఉపాధ్యాయులు గతంలో 18 ఇళ్లు, నర్సిపురం ప్రాంతంలో 8 ఇళ్లను మున్సిపాలిటీ అనుమతులు లేకుండా నిర్మించి లక్షలాది రూపాయలు అమ్మకాలు జరిపారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ఉపాధ్యాయుడే కొంతమందితో కలిసి పలాస మండలం గరుడఖండి పంచాయతీ సరియాపల్లిలో ఉన్న చెరువును మట్టితో కప్పేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ చెరువు దిగువ ఆయకట్టు రైతులకు చెందిన సుమారు 50 ఎకరాల భూములకు సాగునీరు అందించేది. ఈ చెరువుపై ఇద్దరు అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. చెరువును పూర్తిగా కప్పేసి ప్లాట్లు వేసి అమ్మకాలు జరపాలనే ప్రణాళికలు వేశారు. అంతే వేగంగా రెండు రోజులు క్రితం చెరువును లోతుగా తవ్వి ఆ మట్టిని వెనుక భాగంలో వేస్తూ చదును చేసుకొని వస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది రైతులు అక్కడకు చేరుకొని అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. సరియాపల్లి గ్రామానికి అనుకొని ఉన్న చెరువును మట్టితో కప్పితే ఎలా పంటలు పండించుకోవాల్సి వస్తుందని ప్రశ్నించారు. రైతులు వారిస్తున్నా అధికార పార్టీ పేరుతో ఇద్దరు చోటా నాయకులు మాత్రం పనులు నిలుపువేయలేదు. చివరకు రైతులంతా ఏకమై అడ్డుకోవడంతో ప్రస్తుతం పనులు నిలిపి వేశారు. ఈ విషయమై పలాస తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్తామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి వీరి కబ్జాలను అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలతో న్యాయం చేశాం : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర -మందస: వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి న్యాయం చేశామని, వచ్చే ఎన్నికల్లో ఆయన నాయకత్వాన్ని ప్రజలు బలపర్చాలని మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం రాత్రి మండలం నారాయణపురం పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల వైసీపీ పాలనలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందరికి మంచి చేయాలనే ఉద్దేశంతో పథకాలు అందించామని, ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాకపోతే వారికి ఇప్పించే బాధ్యత తనదని మంత్రి హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టిన ప్రభుత్వం మనదని, కరోనా కష్టాలున్నా చెప్పిన సమయానికి చెప్పిన కార్యక్రమంనకు సంబంధించి బటన్ నొక్కి ప్రజల ఖాతాల్లో జమ చేసిన గొప్ప మనస్సు ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని అన్నారు. ప్రతి వయస్సు వారికి ఒక్కొక్క పథకం పెట్టి వారికి కూడా ఆసరా కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం శిశు సంక్షేమ శాఖా ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఏర్పాటు చేసిన సంపూర్ణ పౌష్టికాహార వారోత్సవాలు, గర్భిణీలకు శ్రీమంతం, పిల్లలకు అన్నప్రసాన కార్యక్రమం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, వైస్ ఎంపిపి ప్రసాద్, పంచాయతీ అధ్యక్షులు మడియా సోమేశ్వరరావు, ఎంపిటిసి గొరకల పార్వతీ కేశవరావు, ఉపసర్పంచ్ శ్రీరాములు, హార్టికల్చర్ యూనివర్శిటీ బోర్డు సభ్యులు బమ్మిని లక్ష్మణ్‌లతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనరులు, గృహసారథులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు విద్యార్థులకు వరం : ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర -కవిటి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం విద్యార్థులకు ఓ వరం అని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని సిలగాం గ్రామంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిలగాం పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు నర్తు రామారావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా రామారావు మాట్లాడుతూ చిన్న నాటి నుంచి విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని అన్నారు.విద్యార్థులు సాధించింది పాఠశాలలకు,తల్లిదండ్రులకు మంచి కీర్తిని తెచ్చి పెదుతుందని అన్నారు.జగనన్న ప్రభుత్వంలో ఇలాంటి ప్రోత్సాహకాలు అందించటం ప్రథమమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్,స్వచ్ఛభారత్ డైరెక్టర్ కృష్ణారావు రౌలో, సర్పంచ్ ప్రతినిధి కడియాల బాబురావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు చేతుల మీదుగా ప్రథమ స్థానం పొందిన గుడియా హేమలత, ద్వితీయ స్థానం పొందిన పిల్లి భార్గవి, తృతీయ స్థానం పొందిన వజ్జ స్వాప్నిక లకు స్థానిక సర్పంచ్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించి 3వేల రూపాయలు, రెండు వేల రూపాయలు వెయ్యి రూపాయలు నగదు తో పాటు గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్‌లను అందజేసి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు, విద్య కమిటీ చైర్మన్ మొగలిపురి కృష్ణారావుతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగింపుపై అలసత్వం తగదు

- ప్రభుత్వ భూమిని ఆక్రమించేవారిపై కఠిన చర్యలకు ఉపక్రమించాలి
- అందుబాటులో గల ప్రభుత్వ భూమిపై సమగ్ర వివరాలు సేకరించాలి : ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో మండలాలతో పాటు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం కోరారు. శనివారం ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీ సంభందించిన అధికారులు, తహసిల్దారులు, సర్వేర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కట్టుదిట్టమైన అధికార యంత్రాంగం ఉన్నప్పటికీ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం క్షమించరాని నేరం అన్నారు. ఆక్రమణదారులు ఎంతటివారైనా, ఉపేక్షించరాదన్నారు. నియోజకవర్గంలో పలుచోట్ల మంజూరయ్యే ప్రభుత్వ భవనాలు నిర్మాణాలకు గాని, అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్న భూమి గగనమవుతుందన్నారు. చివరికి భవనాల నిర్మాణాలకు, లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి ప్రభుత్వమే భూ సేకరణ చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నప్పటికి, అధికారులు నిద్ర పోతున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల రికార్డులు వారీగా పంచాయతీ చెరువులు, ఇరిగేషన్ చెరువులు, పోరంబోకు స్థలాలు,కొండ పోరంబోకు స్థలాలు,కాలువ గట్లలో ఆక్రమిత స్థలాలతోపాటు ఏ ప్రభుత్వ శాఖకు చెందిన స్థలాన్ని అయిన ఆక్రమణదారులకు గుప్పిట్లో ఉంటే వాటిని వెంటనే ఖాళీ చేయించాలని సూచించారు. అవసరమైతే చట్టపరమైన చర్యలకు అడుగులు వేయాలని కోరారు. మొండి కేస్తే పోలీస్ కేసులను నమోదు చేయాలని సూచించారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు కళ్ళ ఎదుటే అన్యాక్రాంతం అవుతుంటే ఘోరమైన తప్పిదంగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవడం ద్వారా ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించిన వారిగా నిలవాల న్నారు.తాను నిర్వహించిన రివ్యూకు సబ్ డివిజన్ రెవెన్యూ అధికారులు, ఆమదాలవలస మండల తాసిల్దార్ హాజరు కాకపోవడం పట్ల స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్ ఎమ్మార్వోలు, అర్ఐలు, సర్వేయర్ పాల్గొన్నారు.

నీట్ మొదటి ర్యాంకర్ చక్రవర్తికి ఎంపీ అభినందనలు

విశాలాంధ్ర -పోలాకి: మండలం తోటాడ గ్రామంలో ఇటీవల జాతీయ స్థాయి నీట్ ర్యాంకులో ప్రథమ స్థానం సాధించిన బోర వరుణ్ చక్రవర్తిని శనివారం వారి నివాసంలో శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మొదటి ర్యాంక్ సాధించి జిల్లాకు పేరు తీసుకురావటం గర్వకారణం అని, ముమ్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈయన వెంట మాజీ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి కోటబొమ్మాళి ప్రాథమిక పరపతి సహకార సంఘం మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ , కోటబొమ్మాళి మండల మాజీ ఎంపీపీ తర్రా రామకృష్ణ, మండల టీడీపీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

దొంగతనాలు అరికట్టేందుకే కెమెరాలు ఏర్పాటు

విశాలాంధ్ర -నరసన్నపేట : పట్టణంలో దొంగతనాలు అరికట్టేందుకు పిటిజెడ్ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్.ఐ, వై.సింహాచలం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, జి.రాధిక ఆదేశాల మేరకు పట్టణంలో జోగిపేట జంక్షన్, గాంధీ బజారు జంక్షన్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్, మోహన్, కెమెరా సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : శ్రీకాకుళం పట్టణ పరిధిలోని రైతుబజార్ సమాఖ్య సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా మెప్మా పి.డి.యం. కిరణ్ కుమార్ సమీక్ష కార్యక్రమం నిర్వ హించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు గురించి ఉద్దేశించి మాట్లాడిన పి.డి.కిరణ్ జగనన్న హౌసింగ్ మరియు చేయూత. కొత్తగా ఆహార కేంటీన్లు గురించి ఆర్.పి.లకు అండ్ సి.ఓ.లకు వాటి గురించి వాటి విధివిధానాలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సిఎం ఎం.శారదవాణి ఐబి రాము, బి.ఎల్. వెంకట్రావు, ఎల్.హెచ్. భాస్కర్ పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు సుగాణారెడ్డి సి.ఓ.లు రవికుమార్ సాయి. నాగామణి. అరుణ జయమణి, జ్యోతీ, వినోద్, ఆర్.పి.లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీ నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేత

విశాలాంధ్ర-పాతపట్నం : నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కొత్తూరు మండలం కుద్దిగాం అంగన్వాడీ కేంద్ర సహాయకురాలుగా పెనుగుదురు. సాయిలీలకి, నివగాం-3 అంగన్వాడీ కేంద్ర సహాయకురాలుగా అల్లాడ గౌరమ్మకి, స్థానిక శాసన సభ్యురాల రెడ్డి శాంతి నియామక పత్రాలను అందజేశారు.

సరుబుజ్జిలి మండల కేంద్రం... చెత్తకుప్పలకు నిలయం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : మండల కేంద్రంలో అభివృద్ధి మాట పక్కన పెడితే ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి నాలుగు వైపులా ఎటు చూసినా చెత్త కొప్పులు ఉండడంవల్ల, చెత్త పోగులను కుక్కలు రోడ్లపై ఈడ్చుకొని రావడం వల్ల, రోడ్డుపై నడవడానికి ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు తెలియజేశారు. పారిశుద్ధ్యమే పరమావధిగా భావించే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మండల కేంద్రంలోని చెత్త పోగులు గుట్టలుగా వేయటం ఎంతవరకు భావ్యం....? రానున్నది వర్షాకాలం అవడం వల్ల, చెత్త పోగులు కుళ్ళి అంటువ్యాధులు ప్రబలడానికి కారణం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, అధికారులు చెత్త పోగులను పూర్తిగా తొలగించే ప్రక్రియను చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లోలుగు కెజిబివి విద్యార్థినికి స్టేట్ బ్రిలియన్స్ అవార్డుతో సత్కారం

విశాలాంధ్ర -పొందూరు: శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్-2023 కార్యక్రమంలో శనివారం మండలంలోని లోలుగు కేజీబీవీ ఇంటర్ బైపీసీ విద్యార్థిని వంపూరి అశ్వినిని రూ.50 వేలు నగదు ప్రోత్సాహకంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాం, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చేతులు మీదుగా విద్యార్థినికి రూ.50వేలు చెక్కుతో పాటు ప్రశంసా పత్రంతో సత్కరించారు. విద్యార్థిని జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో ఇంటర్ బైపీసీ విభాగంలో 956 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థినితో పాటు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం లభించడంతో కేజీబీవీ ఉ పాధ్యాయినిలు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇందులో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కలెక్టర్ శ్రీకేశ్ లారకర్, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : ఎంపీపీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు స్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరు చేసిన జగనన్న కాలనీలకు నీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మండల పరిషత్ అద్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావులు అన్నారు. ఆయన శనివారం మండలంలోగల జర్జంగి పంచాయతీ పరిధిలో గల జగనన్న కాలనీలను స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. ఫణీంద్రకుమార్‌తో కలిసి పరిశీలించారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులు నిర్మాణాలు చేపడుతున్న ఇల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ప్రతి శనివారం మండలంలో నిర్మాణాలు జరుగుతున్న జగనన్నకాలనీలను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే లబ్ధిదారులు వేగంగా ఇల్లు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఎవ్వరి నుంచి ఏదైన సమస్య ఉన్న తమకు తెలియజేయాలన్నారు. జగనన్న కాలనీలకు అన్ని వసతులు కల్పించటం జరుగుతుందని ఇప్పటికే రోడ్డు, విద్యుత్, మంచినీటి కోసం ప్రతిపాధనలు సిద్ధం చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రెడ్డి పాపినాయుడు, ఎలక్ట్రికల్ ఏఇ సురేష్, పిఆర్ఏఈ లతశ్రీ, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ కావ్య, ఎన్ఆర్‌జీఎస్ క్లస్టర్ జేఈ జి. హరిప్రసాద్, సర్పంచ్ అన్నెపు సుశీల, ఉపసర్పంచ్ రామారావు, ఎంపీటీసీ అన్నెపు లక్ష్మిబాయి, వైకాపా నేతలు నేతింటి సింహాచలం, కార్యదర్శి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక లెప్పర్స్ కాలనీలో క్షయ, కుష్టి వ్యాధిగ్రస్తులకు శనివారం బలగకు చెందిన శీలా. హరిబాబు, స్రవంతి కుమారుడు శీలా సుమంత్ సాయి సుమారు ఇరవై పేద కుటుంబాలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా నాన్న హరిబాబు హార్ట్ ఎటాక్ తో చనిపోగా, అన్నయ్య యస్వంత్ సాయి కూడా బ్రెయిన్ డెడ్ తో క్రిందటి సంవత్సరం జూన్ 2023 చనిపోయాడని ఇద్దరూ దూరమవ్వటం బాధాకరమని తన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులు శనివారం అన్నదాన సేవ చేస్తున్నారని, అన్నదాన సేవలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ కుష్టి వ్యాధి గ్రస్తులు బ్రతుకుతెరువు కోసం ఏ పనీ చెయ్యటానికి వీలు లేక ఇబ్బంది పడుతున్నారని, రోజూ ఎవరు వచ్చి అన్నం పెడతారా అని ఎదురుచూస్తున్నారని, మానవత్వం గల దాతలు వీళ్ళని ఏదో ఒక రూపం లో ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యస్వంత్ సాయి కుటుంబ సభ్యులు శంకర్ రావు, నాగరాజు, సామాజిక కార్యకర్త నంది ఉమా శంకర్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రక్ట్, అవుట్‌సోర్సు ఉద్యోగులందరిని క్రమబద్ధీకరణ (రెగ్యులర్) చేయాలని శనివారం తెలుగు నాడు ట్రేడు యునియన్ కౌన్సిల్ (టిఎన్‌టియుసీ) టెక్కలి నియోజకవర్గ అద్యక్షుడు జి.నరసింగరావు టెక్కలి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో 2014 జూన్ 2వ తేదీ నాటికి 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేస్తున్న 10,117 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సు ఉద్యోగులకు మాత్రమే క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అ నిబంధనలువలన అనేక మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సు ఉద్యోగులు నష్టపోతారని, కనుక అందరిని రెగ్యులరైజేషన్ చేయ్యాలని మీద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసీ ప్రధాన కార్యదర్శి ధరాపు రాము, జిల్లా కార్యదర్శి ధర్మారావు, రాజాపు, శిమ్మ శ్రీను, అప్పారావు అదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి : వ్యవసాయానికి వైసీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని సిలగాం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద సబ్సిడీ ద్వారా వరి విత్తనాలను ఎంపీపీ ప్రతినిధి,మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కడియాల ప్రకాష్ తో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టర్ కృష్ణారావు రౌల్లో, కడియాల బాబురావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు బెందాళం శ్రీ కళ్యాణ్, లమ్మత పవన్, దిక్కల అన్వేష్, సాయి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పశు భీమాను వినియోగించుకోండి

పశు వైద్యాధికారి హేమలత

విశాలాంధ్ర-ఆమదాలవలస : రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న వైయస్సార్ పశు భీమా ను వినియోగించుకోవాలని అక్కులపేట పశు వైద్యాధికారి హేమలత తెలిపారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ 400 రూపాయలు ఒక్కొక్క సంకరజాతి పశువుకు చెల్లిస్తే మూడేళ్లపాటు బీమా వర్తింపుకు అవకాశం ఉంటుందన్నారు. మూడేళ్ల లోపు ఎటువంటి కారణాలతో చనిపోయిన 30 వేల రూపాయలు బీమా సౌకర్యం రైతు కు అందుతుంది అన్నారు. దేశ వాలీలకు 200 రూపాయలు చెల్లిస్తే 15000 రూపాయలు భీమా వర్తిస్తుందన్నారు. ఒక్కో కుటుంబానికి గరిష్టంగా ఐదు పాడి పశువుల వరకు భీమ వర్తిస్తుందని వివరించారు. ఒక కుటుంబం ఐదింటికి భీమా చెల్లించుకోవచ్చు అన్నారు. ఈ పథకం ద్వారా గొర్రెలు, మేకలుకు కూడా భీమా చేయించుకోవచ్చు అని తెలిపారు. అక్కులు పేట పరిధిలో అరవై శాతం మంది రైతులు వైయస్సార్ పసుభీమా చెల్లించారని మిగిలిన వారు కూడా త్వరితగతిన ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాన్ని అందివుచ్చుకోవాలని ఆమె వివరించారు.

జీడీకి మద్ధతు ధర ప్రకటించాలి

తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేసిన జీడి రైతులు

విశాలాంధ్ర-కవిటి : జీడీకి పదహారు వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించాలని కవిటి మండల జీడి రైతులు తహాసిల్దార్ పి శేఖర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రమైన కవిటి తహాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇటీవల పలాసలో జీడి వ్యాపారులు సమావేశమై 80 కేజీల జీడి పిక్కలు బస్తా ఎనిమిది వేల రూపాయలకు కొనుగోలు చేస్తామని ప్రకటించడం ఎంత వరకు సమంజసం అని అన్నారు.వివిధ రకాల గ్రేడింగ్ చేస్తూ కేజీ జీడిపప్పు 6వందలు రూపాయలు నుండి వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నారని ఇప్పటికే చాలామంది చిన్న సన్నకారు రైతులు వడ్డీలకు డబ్బులు తెచ్చి జీడి తోటలు కౌలుకు తీసుకున్నారని ఇటువంటి పరిస్థితుల్లో 80 కేజీలు జీడిపప్పు 16వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించి జీడి రైతులకు న్యాయం చేయాలని వినతిలో పేర్కొన్నారు.ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఓ ప్రెసిడెంట్ బి జయప్రకాష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలే ఆదర్శం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : చదువులో రాణించడం వల్ల జీవితం మెరుగ్గా ఉంటుందని, భవిష్యత్‌ను రూపుదిద్దుకునేందుకు కుటుంభాలకు తోడుగా నిలిచేందుకు చదువు చాలా అవసరమని మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆణిముత్యాలు కార్యక్రమాన్ని శనివారం ఏ.పి. మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ శివప్రసాద్, పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మైలతల ఆధ్వర్యంలో నిర్వహించగా ఛైయిర్‌పర్సన్ ముఖ్య అతిధిగా హాజరై ప్రశంసా పత్రాలు అందజేసారు. ఈ ఏడాది ఆణిముత్యాలుగా నిలిచిన విద్యార్థులు ఇతర విద్యార్థులకు ఆదర్శమని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందివ్వడం, అందుకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చడం ప్రధాన ఉద్దేశ్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఆమె తెలిపారు. 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన వారిని మరింత ప్రోత్సాహించడానికి అణిముత్యాలు అవార్డ్స్ ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ ఏడాది అవార్డ్ పొందిన వాళ్ళని ప్రేరణగా తీసుకొని వచ్చే ఏడాది విద్యార్థులు మరింత ప్రతిభ కనబరచాలని కోరారు. ఏ.పి మోడల్ స్కూల్‌కు చెందిన కిరణ్ సాహు, అందాల కీర్తి, కె.నికిత, సి.హెచ్.ఆసిని, పురుషోత్తపురం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కె.విధ్యా జి.లక్ష్మి, ఆశి దీపలకు అణిముత్యాలు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాఠశాలల కో-ఆర్డినేటర్ ఫల్గుణరావు, పేరెంట్ కమిటీ చైర్మన్ ధర్మా తదితరులు పాల్గొన్నారు.

విధ్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకే జగనన్న ఆణిముత్యాలు

విశాలాంధ్ర-నరసన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విధ్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకే జగనన్న ఆణిముత్యాల పథకం లక్ష్యమని ఎంపిపి, ఆరంగి మురలీధర్ అన్నారు. శనివారం ఆయన మండలంలో సత్యవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 562 మార్కులు సంపాదించిన ఎం.యాదగిరికి ప్రథమ బహుమతిగా రూ.3000, 525మార్కులు కైవసం చేసుకున్న జే.వినోద్‌కు రూ.2000, 518మార్కులు సాధించిన బి.శ్యామలకు తృతీయ బహుమతిగా రూ.1000 నగదు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్, బాలరాజు, వార్డు మెంబర్లు, లక్ష్మీనారాయణ, నీలంరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జే.కృష్ణంరాజు, ఉపాధ్యాయులు, బి.కేశవరావు, జి.శాంతి, ఎం.కృష్ణమూర్తి, ఎన్.హైమావతి, అమ్మినాయుడు, భీమారావు, ఆనంద్, సుభాషిణి, సునీత పాల్గొన్నారు.

బోర్ద్ హైస్కూల్‌లో... స్థానిక ప్రభుత్వ ఉన్నత

పాఠశాల(బోర్డు)లో శనివారం పది తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎంపిటిసి, వైశ్యరాజు కేశరరాజు మోమెంటోలు అందచేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించటమే కాక వారు పరీక్షల్లో సాధించిన మార్కులు ఆధారంగా నగదు బహుమతి అందించే ఉత్తమమైన పథకమే జగనన్న ఆణిముత్యాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్, గనగళ్ళ వేంకట శ్రీనివాసరావు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్, గంగు మన్మధరావు, బోర్డు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, సువ్వారి శ్రీనివాసరావు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలాసలో : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల హెచ్.ఈ.సి విద్యార్థిని ఇప్పిలి చామంతి జిల్లా టాపర్‌గా జగనన్న ఆణిముత్యం పురస్కారాన్ని శనివారం శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో అందుకుంది. ఈ పురస్కారంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన 50వేల నగదు బహుమతి ఈ విద్యార్థినికి సొంతమైంది. రాష్ట్ర శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారామ్, రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లఠ్కర్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యలు చామంతి ఈ పురస్కారాన్ని అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్, చరిత్ర అధ్యాపకులు కొండల మధుబాబులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా చామంతి శుక్రవారం కాశీబుగ్గలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయిలో టాపరుగా నిలబడడంతో 15వేల రూపాయలను అందుకుంది. జిల్లాలో చరిత్ర సృష్టించిన చామంతికి కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

సోంపేటలో : మండలం పొత్రఖండ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో

జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెడల్స్, నగదును సోంపేట ఎంపీపీ, చీపురుపల్లి నియోజకవర్గం పరిశీలకులు నిమ్మన దాసు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసుతో పాటు సర్పంచ్ బేసి ఖగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు రౌతు విశ్వనాధం, ఎయు ఎక్స్ వీసీ శాంతయ్య, శ్యాంబాబు, ధర్మారావు, రామారావు, వినోద్ చంద్రపండా, హెచ్ఎం సింహాచలం, ఎస్ఎంసి చైర్మన్ భాస్కరరావు, ఢిల్లీరావు, కృష్ణమూర్తి, వాసుదేవ్, అధ్యాపక, అధ్యాపకేతం సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మండలం బేసిరామచంద్రాపురం జిలా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో 10 వతరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు స్టేట్ బ్రిలియన్స్ 2023 కింద సత్కార కార్యక్రమం జరిగింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వరుసగా 3వేలు, 2వేలు, వెయ్యి రూపాయలు నగదు బహుమతితో పాటు మెడల్స్, ప్రశంసాపత్రాలను గ్రామ సర్పంచ్ ప్రతినిధి బుద్దాన శ్రీకృష్ణ, పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, పేరెంట్స్‌కమిటీ చైర్మన్ జన్ని నారాయణరావుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడండి

జిల్లా అదనపు వైద్యాధికారిని డా.అనురాధ

విశాలాంధ్ర-పలాస : రక్తదానంతో ప్రమాదాలకు గురైన వారి ప్రాణాలను కాపాడ వచ్చని, ప్రతిఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా అదనపు వైద్యాధికారిని డాక్టర్ అనురాధ, పలాస ఆర్డీవో సీతారామ్మూర్తిలు న్నారు. ప్రపంచ రక్తదానం దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ వారిగా జరుగుతున్న రక్తదాన శిబిరాల కార్యక్రమంలో భాగంగా శనివారం పలాస ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంపై ప్రజలల్లో అపోహాలున్నాయని, ప్రతి 6 నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వలన ఆరోగ్య వంతులుగా ఉంటారని పేర్కొన్నారు. ఆరోగ్యవంత మైన సమాజం నిర్మాణంకోసం రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక అనేక మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన వారికి సకాలంలో రక్తం అందిస్తే వారి విలువైన ప్రాణాలను కాపాడేవారమవుతామని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో 87 మంది యువతి యువకులు తమ రక్తంను దానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వజ్రపుకొత్తూరు, మందస తహశీల్దార్లు అప్పలస్వామి, బి.పాపారావు, వజ్రపు కొత్తూరు, మందస ఎంపిడివో ఈశ్వరమ్మ, తిరుమలరావు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టు మేనేజరు ఉమామహేశ్వర రావు, 17వ కౌన్సిలర్ శ్రీకాంత్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, సచివాలయ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

- నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించినవారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందిని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పేర్కొన్నారు. 2022 సంవత్సరం రాష్ట్ర అవతరణ దినోత్సవం,2023 ఉగాదికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమసేవా పతకం, సేవాపతకాలకు ఎంపికైన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా డీఎస్పీ వాసు దేవ్,సిఐ డివివి సతీష్ కుమార్,ఎస్ఐ ఆర్.శంకర్ రావు,అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ కె.శేఖర్ రావు, ఏఆర్ ఎస్ఐ. ఎం. చిన్నారావు,ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ వై.నర్సింహులు, టి.రాంబాబు, కానిస్టేబుల్ ఏ. మల్లేశ్వరావు, బి.అప్పలనాయుడు. ఇందులో(సిఐ డివివి సతీష్ కుమార్ విజయవాడలో ఉండగా, కానిస్టేబుల్ బి.అప్పలనాయుడు ఇటీవల మరణించడంతో పతకాలు అందుకోలేదు.) పై వారందరికీ శనివారం ఉదయం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన పతకాలను ప్రదానం చేసి,అభినందనలు తెలియజేశారు. ఇటీవల జరిగిన గొలుసు దొంగతనాలకు చెందిన 15 కేసులలో సకాలంలో నేరస్తులను పట్టుకోవడం, కేసు ప్రాపర్టీ రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన టెక్కలి సీఐ ఎస్.సూర్య చంద్ర మౌళి, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణమహమ్మద్ ఆలీ, హెడ్ కానిస్టేబుల్ కె.మోహన్లత్, వెంకట్ సత్యం,ఎం.శ్రీధర్ కుమార్, కానిస్టేబుల్ ఏ.త్రినాథరావు, వి.భూలోకేష్ రావు,బి.లోక్ నాదం, డి.ఉమా మహేష్ రావు,సదరు నేరాల ఛేదనలో, నేరస్తులను పట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు క్యాష్ రివార్డులు ప్రదానం చేశారు.

- మహిళ పోలీసులకు జ్ఞాపికాలను ప్రదానం... జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీసులు విధి నిర్వహణలో దిశ యాప్ డౌన్లోడ్, అసాంఘిక కార్యకలాపాలపై ముందుసు సమాచారం, గ్రామ స్థాయిలో మహిళలకు అవగాహన, చైతన్యాన్ని తీసుకొవచ్చి, వివిధ అంశాలపై గుడ్ వర్క్ చేసిన ఎం.శిరీష, శోభన భగు, యు.ఐశ్వర్య,టి.త్రివేణి, ఎస్.గీతప్రియ,మెట్ట జయలక్ష్మి,సి.హెచ్ అసలత,ముద్దాడ నాగమణి,ముద్దాడ షణ్ముఖి, చింతపల్లి శిరీష,వైశ్యరాజు స్వాతి, జి.దివ్య, ఎం. శ్రావణి, టి. ధనలక్ష్మి, బొమ్మాళి ఝాన్సీ, డి.లావన్య, బి.కాళీ ప్రసన్, నౌగన అనూష, లంకా వాసంతి, పతి హైమవతి, పీసా హేమలత, ఎస్.సంధ్య, భానుమతి అను 23 మహిళ పోలీసులకు ప్రత్యేక జ్ఞాపికాలను అందజేసి మరింత నిబద్ధతతో, అంకిత భావంతో విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి ప్రతిష్ట తీసుకురావాలని ఎస్పీ తెలిపి ప్రత్యేకంగా అభినందించారు.

- ప్రతిభకు ప్రశంస... దిశ యాప్ డౌన్లోడ్స్, రహదారి ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిని తనిఖీ చేసి జరిమానా విధించడంతో ప్రతిభ చూపిన కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, ఒకటవ పట్టణం, శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, లావేర్,టెక్కలి, కోటబొమ్మళి, నందిగాం, బారువ పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్స్ గణేష్, విజయ కుమార్, కృష్ణ, కోటేశ్వరరావు, రామకృష్ణ, మహమ్మద్ ఆలీ,అహమద్ ఆలీ, చిరంజీవి అను వరికి జిల్లా ఎస్పీ చేతులు మీదుగా ప్రశంస పత్రాలు ప్రధానం చేసి అభినందించారు.

బాధితుడిని పరామర్శించిన ఎంపీ

విశాలాంధ్ర-జలుమూరు : మండలం లింగన్నాయుడుపేట గ్రామానికి చెందిన గోండురంగా రావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ.. శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజ రాపు రామ్మోహన్‌నాయుడు శనివారం బాధితుడిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకుని వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయం : స్పీకర్ తమ్మనేని

విశాలాంధ్ర-పొందూరు : పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్ నిజమైన లీడర్ అని, గడప వద్దకే మంచి పాలన తీసుకువచ్చి ఆయన దేశంలోనే అత్యుత్తమ సీఎంగా చరిత్ర సృష్టించారని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మేనిఫెస్టోను దైవంగా భావించి అందులో హామీలను ఇప్పటికే 99 శాతం అమలు చేసి, హామీ ఇవ్వని ఎన్నో అంశాలను సైతం పరిష్కరించారని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా ఏపీ నిలిచిందని అన్నారు. సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు గ్రామ స్వరాజ్యానికి నాంది పలికాయన్నారు. పొందూరు మండలం తండ్యాం మరియు మీసాల పేట గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ బడాన సునీల్, స్థానిక ఎంపీటీసీ వడగ మోహనరావు, స్థానిక నాయకులు గునన్నా కృష్ణ, మీసాల రమణ, రామచంద్రరావు, శ్యామలరావు తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నిత్యజీవితంలో యోగ ఒక భాగం కావాలి

విశాలాంధ్ర-జలుమూరు : ప్రతి మనిషిని జీవితంలో యోగ ఒక భాగం కావాలని యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని టీ లింగాలపాడు సచివాలయ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రూపవతి తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జలుమూరు మండలం టి లింగాలపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలంలో జగనన్న సురక్ష కార్యక్రమం

విశాలాంధ్ర-రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గం, రణస్థలం మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆవరణలో మండల ఎంపీడీఓ ఆర్.వి రమణమూర్తి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రణస్థలం ఎంపీపీ ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ జూలై 1నుంచి, ఆగస్టు1 వరకు జగనన్న సురక్ష "జగనన్నకు చెబుదాం" కి అనుబంధంగా కార్యక్రమాన్ని నెల రోజులు పాటు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటికి సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు వెళ్లి ప్రజా సమస్యలపై దృష్టి సారించి సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల డిప్యూటీ తహశీల్దార్, మండల ప్రత్యేక అధికారి బి.దుర్గారావు, మండల ఏఓ డి.ధనుంజయరావు, విస్తరణ అధికారి ఎ.ప్రభాకరరావు, ఎలక్ట్రకల్ ఏఈ, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, మండల ఎంపీటీసీలు సంఘం అధ్యక్షులు మహంతి చినరామునాయుడు, రాష్ట్ర బీసీ కార్పోరేషన్ డైరెక్టర్ పిల్ల ఆనందరావు పాత్రుడు, మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మునాయుడు, వైసీపీ నాయకులు దన్నాన శ్రీనువాసురావు, మహంతి సత్యనారాయణ, లంక పాపారావు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్రంలో అన్నదాతలకు అండగా వైసిపి ప్రభుత్వం ఉంటుందని ఎంపిపి, ఆరంగి మురలీధర్ అన్నారు. శనివారం మండలంలో సత్యవరం గ్రామంలో సచివాలయం-2లో రైతులకు ఆయన సబ్సిడీపై వరి విత్తనాలు ప్యాకెట్లు అందచేశారు. ఈ సంధర్భంగా ఎంపిపి, మురలీధర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, రైతులు పంట వేసింది మొదలు, చివరికు పంట చేతికి వచ్చి, మార్కెట్ సదుపాయం చేసేంత వరకూ ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారా పండిన వంటలను కొనుగోలు చేసి, రైతులకు వ్యవసాయంపై మక్కువ ఏర్పడినట్లు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్‌లు, సీర లక్ష్మీనారాయణ, నీలంరాజు, రైతులు, బద్ద గోవిందరావు, కొంకేన వెంకట రమణయ్య, దుబ్బ శిమ్మయ్య, కొట్ని చిన్నరమణ, బద్ద వెంకటరమణ, వివిపి, విజయకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్ శతజయంతి ముగింపు ఉత్సవాలను విజయవంతం చెయ్యండి

కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ హేమసుందరరాజు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మాజీ ఎంపీ స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ముగింపు ఉత్సవాలు ఈనెల 21వ తేదీన శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపాల్ గ్రౌండ్‌లో నిర్వ హించటం జరుగుతుందని ఈ కార్యక్రమానికి రాజగోపాల్ అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు కోరారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లుతో మాట్లా డుతూ స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి వేడుకలు ఈనెల 21తో ముగిసిన సందర్భంగా ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం 7 రోడ్డు జంక్షన్ దగ్గర బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహావిష్కరణ, అనంతరం ఎన్టీఆర్ మున్సిపాల్ గ్రౌండ్‌లో బహిరంగసభ నిర్వహించటం జరుగు తుందని దీనికి ప్రతి ఒక్కరు హజ్జరై ఈ కార్య క్రమం విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

నిరుపేదలకు భరోసా వైఎస్సార్ భీమా

విశాలాంధ్ర-కవిటి : వైయస్సార్ భీమా పథకం నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందని సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు అన్నారు. ఈమేరకు మండలంలోని బెలగాం సచివాలయం పరిధిలోని జీ.బెలగాం గ్రామానికి చెందిన లక్కిట్ల సత్యం సాధారణ మరణం చెందాడు. మృతుడు వైఎస్ఆర్ బీమా పథకంలో సభ్యుడిగా ఉన్నందువల్ల తక్షణ సహాయం కింద పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని స్థానిక సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు చేతుల మీదుగా మృతుడు భార్య లక్కిట్ల తిలోత్తమకి అందజేశారు. మిగిలిన మొత్తం 90 వేల రూపాయలు నామిని ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా రైతులతో నవధాన్యాల సాగుపై అవగాహన

విశాలాంధ్ర-గార: మండలం అల్లిగెడ్డ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామంలో ఒకేసారి సామూహికంగా 20 మంది రైతులతో నవధాన్య విత్తనాలను వేయించారు. సిబ్బంది గణమ్మ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతుల ప్రకృతి సేద్యం చాలా ఆసక్తితో చేస్తున్నారని అలాగే నవధాన్యాలు సాగును రైతులు అందరితో పూర్తి విస్తీర్ణంలో సేద్యం చేసేలా గ్రామంలో తాము ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. ఈ నవధాన్యాలు నేలలో వేసుకోవడం వలన భూమిలోపల పంటలకు అవసరమైన సూక్ష్మజీవులు సమృద్ధిగా అభివృద్ధి చెందుతాయని, నేల గుల్లబారుతుందన్నారు. నేలలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని తద్వారా నేల సారవంతంగా మారుతుంద న్నారు. ఇంకా రానునా ఖరీఫ్ సీజన్ కి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం మరింత ఎక్కువ మంది రైతులతో అధిక విస్తీర్ణంలో చేసేలా ప్రణాళికలు చేసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.